# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల నాలుగో విడత పోలింగ్‌లో 67.71 శాతం ఓటింగ్ నమోదైంది.**
2. **రాష్ట్రంలో 78.25 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.**
3. **ఈవీఎంలను భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.**
4. **వారణాసి లోక్ సభ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు నామినేషన్ దాఖలు చేశారు.**
5. **వేసవి రద్దీ దృష్ట్యా విశాఖపట్నం–సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసు ఏర్పాటు చేసినట్లు వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు నిన్న జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 78.25 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్‌లో భాగంగా రాష్ట్రంలోని 25 లోక్ సభ స్థానాల్లో అత్యధికంగా అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో 83.19 శాతం పోలింగ్ నమోదు అవ్వగా, అత్యల్పంగా విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో 68 శాతం పోలింగ్ నమోదైందని తెలిపింది. అలాగే 175 శాసనసభ స్థానాల్లో శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 88.61 శాతం పోలింగ్ నమోదైందని, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు నియోజకవర్గంలో 55 శాతం పోలింగ్ నమోదైందని పేర్కొంది.

--------------------------

మరో వైపు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఈవీఎంలను భద్రత ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార మీనా తెలిపారు. కొన్నిచోట్ల గత రాత్రి 10.30 వరకు పోలింగ్ కొనసాగడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని తెలిపారు. ఈవీఎంలను రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చి ఆ తాళాలను భద్రతా బలగాల అధికారులకు అందించామని తెలిపారు. 24 గంటలూ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

---------------------------

దేశ వ్యాప్తంగా నిన్న జరిగిన లోక్ సభ ఎన్నికల నాలుగో విడత పోలింగ్ లో 67.71 శాతం ఓటింగ్ నమోదైందని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ దశలో తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 96 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఆంధ్రప్రదేశ్లో 78.25 శాతం నమోదు కాగా, బీహార్లో 57.06 శాతం, తెలంగాణలో 64.93 శాతం, జమ్మూ కాశ్మీర్లో 37.98 శాతం, జార?ండ్లో 65.31 శాతం, మధ్యప్రదేశ్లో 70.98 శాతం నమోదు కాగా, మహారాష్ట్రలో 59.64 శాతం, ఒడిశాలో 73.97 శాతం, ఉత్తరప్రదేశ్లో 58.05 శాతం, పశ్చిమ బెంగాల్లో 78.44 శాతం పోలింగ్ నమోదైందని తెలిపింది. కాగా, జమ్మూ కాశ్మీర్ లోని శ్రీనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 37.98 శాతం ఓటింగ్ నమోదైందని, గతంతో పోలిస్తే ఇది అత్యధికమని పేర్కొంది. 4వ విడత పోలింగ్ ముగియడంతో, 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 379 పార్లమెంటరీ నియోజకవర్గాలలో పోలింగ్ పూర్తైనయినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. కాగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది.

---------------------------

ఉత్తర్ప్రదేశ్లోని వారణాసి లోక్ సభ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే మిత్ర పక్షాల నేతలు హాజరయ్యారని బీజేపీ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి ఈ ఉదయం స్థానిక కాలభైరవ మందిరంలో పూజల అనంతరం నామినేషన్ను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే మిత్ర పక్షాల నుంచి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

---------------------------

ప్రారంభ దశలోనే క్యాన్సర్ ను గుర్తిస్తే నివారించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నిన్న ఓ ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ను గుర్తించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్య సిబ్బందికి క్యాన్సర్ ను గుర్తించే స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాలను ఈరోజు నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధన కేంద్రం సమన్వయం, సహకారంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ క్యాన్సర్ స్క్రీ నింగ్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీలకు చెందిన ప్రివెంటివ్ ఆంకాలజిస్టులు ఈ కార్య క్రమానికి హాజరవుతారని వివరించారు. అన్ని ప్రాంతాల సామాజిక ఆరోగ్యాధికారులు, పట్టణ ఆరోగ్య కార్యకర్తలు ఆసుపత్రుల సిబ్బందికి శిక్షణను అందించనున్నామని పేర్కొన్నారు

---------------------------

వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైలు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్లోని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ఈరోజు, రేపు ఈ ప్రత్యేక రైలు నడపనున్నట్లు వెల్లడించారు. ఈరోజు సాయంత్రం 4 గంటల 15 నిమిషాలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటల 15 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకోనుంది. అలాగే, రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు సికింద్రాబాద్లో బయల్దేరనున్న ఈ ప్రత్యేక రైలు రాత్రి 11 గంటల 30 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

---------------------------

పన్ను చెల్లింపుదారులు ఇకపై వారి వార్షిక సమాచార ప్రకటన – ఏఎస్ఐ సమాచార నిర్ధారణ ప్రక్రియ స్థితిని తెలుసుకోవచ్చని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. పన్ను చెల్లింపుదారులు నిర్వహించే పెద్ద మొత్తంలోని ఆర్థిక లావాదేవీల వివరాలను ఏఎస్ఐ అందిస్తుందని ఈ మేరకు ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది.

---------------------------

రామచరితమానస్, పంచతంత్ర, సహృదయలోక-లోకన రచనలను యునెస్కో ప్రపంచ ఆసియా-పసిఫిక్ ప్రాంతీయ పట్టికలో చేర్చింది. ఈ రచనలు భారతదేశపు గొప్ప సాహిత్య, సాంస్కృతిక వారసత్వాలకు ప్రతీకలని, ఇవి భారతీయ సాహిత్యాన్ని, సంస్కృతిని ప్రభావితం చేశాయని పేర్కొంది. ప్రపంచ సాంస్కృతిక పరిరక్షణ ప్రయత్నాలలో భాగంగా అపూర్వమైన సాహిత్య రచనలను గౌరవించడం ద్వారా, విశిష్ట రచనలను భవిష్యత్ తరాలకు అందిచవచ్చని పేర్కొంది. కాగా రామచరితమానస్ ను తులసిదాస్ రచించించగా, పంచతంత్రను విష్ణు శర్మ సహృదయలోక-లోకన ను ఆచార్య ఆనందవర్ధన్ రచించారు.

---------------------------

రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ఈ రోజు ప్రారంభమైంది. చాటింపుతో గంగమ్మ జాతరను తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానం అధికారులు ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే జాతరలో రోజుకొక వేషధారణ ధరించి అమ్మవారికి భక్తులు మొక్కులు సమర్పించుకుంటూ ఉంటారు. ఈనెల 15వ తేదీ బైరాగి వేషం, 16న బండవేషం, 17న తోటివేషం, 18న దొరవేషం, 19న మాతంగి వేషం, 20న సున్నపు కుండల వేషం, 21వతేదీన గంగమ్మజాతర జరుగనుంది. రాయలసీమ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశామని తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం అధికారులు తెలిపారు.

---------------------------

రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఇప్పటివరకు 1.02 లక్షల మంది రైతుల నుంచి 2,196 కోట్ల రూపాయల విలువైన 10.05 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. రైతులకు గోనె సంచులు, రవాణా చార్జీల కింద టన్నుకు 2,523 రూపాయలను చెల్లించినట్లు తెలిపింది. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు సంభవిస్తే తక్షణమే ధాన్యాన్ని తరలించేలా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంది. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, కాకినాడ, బాపట్ల జిల్లాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎక్కువగా వస్తోందని తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి.ఎస్.ఎమ్.రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....30 సెకన్లు....

======================